# నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్

బి.ఎస్.ఎన్.ఎల్. (రిజిష్టర్ నెం. 4906)

తెలంగాణ సర్కిల్ బ్రాంచ్ - హైదరాబాద్.

సర్క్యులర్ నెం.18/2025 తేదీ. 05-06-2025

డియర్ కామ్రేడ్స్,

బి.ఎస్.ఎన్.ఎల్.లో మూడవ వేజ్ రివిజన్ ఎందుకు కావడం లేదు. దీనిపై చాలా విమర్శలు వస్తున్నాయి. దానిపై సర్కిల్ కార్యదర్శిగా నాకున్న అనుభవాన్ని మీతో పంచుకోవాలని దానిలో ఎవరు దాగుడు మూతలు ఆడుతున్నారో మీరు గుర్తెరుగాలని కొన్ని విషయాలు మీ ముందుంచుతున్నాను. అంతే గానీ దీనిని బూతద్దంలో చూడవద్దని విజ్ఞప్తి. బి.ఎస్.ఎన్.ఎల్.లో పనిచేస్తున్న ఉద్యోగులు 60 వేల లోపే వున్నారు. వారిలో గ్రూప్ -సి మరియు డి వారు చాలా మంది స్టాగ్నేషన్‌తో బాధపడుతున్నారు. నా వ్యక్తిగతంగా వేజ్ రివిజన్ రాకపోవడానికి కారణాలు ముఖ్యంగా మూడు. (1) కేంద్ర ప్రభుత్వం / బి.ఎస్.ఎన్.ఎల్. మేనేజిమెంట్ వైఖరి, (2) డి.పి.ఇ. గైడ్ లైన్స్, (3) వేజ్ రివిజన్ కమిటీలో వున్న నాయకులు (సభ్యులు) వ్యవహార శైలి. కమిటీ సభ్యులందరు సమానమే. వారి వారి ఆలోచనలు చెప్పడంలో తప్పులేదు. కానీ కర్రపెత్తనం పనికి రాదు. ఎవరి యూనియన్ నాయకులు వారి యూనిట్లో గొప్పవారు. కానీ ఎదుటి వారిని కించపరిచే విధంగా వ్యవహరిస్తే సమస్యకు ముగింపుకు రాదు. అదే తేది. 29-04-2025న జరిగింది వాస్తవం. మనకు సమస్య సెటిల్ కావడం ముఖ్యం. దాని వల్ల ఏండ్ల తరబడి స్టాగ్నేషన్‌లో వున్న వారికి కొంతలో కొంత న్యాయం జరుగుతుంది. కానీ స్టాగ్నేషన్లు రావడానికి కారణాలు విశ్లేషించకుండా ఎప్పుడు ఎదుటి వారిని తక్కువగా చూసి మాట్లాడడంతో సమస్య ఒక కొలిక్కి రావడం లేదని స్పష్టమైంది. అది చెప్పకుండా "వీరులం, శూరులం" అని మాట్లాడడం కొందరికే చెల్లుతుంది. దానివలన సమస్య ఇంకా వెనక్కు వెళ్తుందని గ్రహించకుంటే దురదృష్టకరంగా భావించాల్సి వస్తుంది.

చాలా దఫాలుగా చర్చలు జరిగిన తరువాత, వేజ్ కమిటీ చైర్మెన్లు తరుచుగా మారడం వలన పరిస్థితి కొంత ఆందోళనకరంగా మారింది వాస్తవం, కానీ ప్రస్తుత పరిస్థితి వేరుగా వుంది. ఇరువర్గాలు (మేనేజిమెంట్ సైడ్ మరియు యూనియన్ సైడ్) వారు చర్చించిన తరువాత కొన్ని స్కేల్స్‌లో తేడాలున్నవని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దానిని చాకచక్యంగా పరిష్కరించుకొనే సమసయంలో "నేను చెప్పించే వేదం - మీకు ఎవ్వరికీ ఏమీ తెలియదు" అనే వాదనలతో తేది. 29-04-2025న సమావేశం ముగిసినది. దానికి బాధ్యత ఇరువర్గాలవారిపై వున్నది. కానీ యూనియన్ నాయకులు దానిని సరిచేయడానికి ప్రయత్నించక 'నేను గొప్ప, నేను గొప్ప' అనే వాదనలతో ఏమీ తేలదు. దీని వలన నష్టము కమిటీ మెంబర్లకు కాదు. వేజ్ రివిజన్ కొరకు ఎదురు చూస్తున్న వారికి అన్యాయం జరుగుతుంది. ఇది నిజం కాదా! దీనిని అవగాహన చేసుకోకుంటే చరిత్ర మనలను క్షమించదు. ఇప్పటికే మిగిలియున్న కార్మికులలో అసంతృప్తి తారా స్థాయికి చేరుకుంది. ఇది వాస్తవం, దానితో కార్మికులు నాయకులపై అన్ని రకాలుగా విమర్శలు చేస్తున్నారు. రిటైర్డ్ అయిన వారికి బైంకి పెన్షన్ వస్తుంది. మరి వారికి మన వేజ్ రివిజన్‌తో ఏమి కడుపునొప్పి అని కొందరు, నాయకులకు ఉన్న సదుపాయాలు ఏమి తగ్గుటలేదు కదా, ఇలా ఎన్నో రకాలుగా వింటున్నాము.

అందుకే కా॥ ఒ.పి. గుప్తా గారిని గుర్తు చేస్తున్నారు. కారణం కా॥ గుప్తాగారు ఇలా అనే వారు **"సమస్య పరిష్కారం కావాలనుకుంటే ఒకటికి 10 సార్లు చర్చించమనే వారు. రూపాయిలో 50 పైసలు ఇస్తామని మేనేజిమెంట్ చెబితే దాన్ని తీసుకొని మిగితా దాన్ని సాధించుటకు పోరాడాలని సూచించేవారు. పోరాటాలలో అవసరమనుకుంటే ఒక అడుగు వెనక్కు వేయమనేవారు".** ఇది వారు అవలంభించి చాలా సమస్యలు పరిష్కరించారు. విమర్శలను ఎదుర్కొని నిలబడ్డారు. అంతే కానీ ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ పోతుంటే పుణ్యకాలం పోతుంది. 2027 కూడా వస్తుంది. కార్మికుల ఓపికను పరీక్షలో పెడితే అసలుకే మోసం గుర్తించాలి.

మైకులు పట్టుకుంటే గంటాపథంగా (నేను కూడా) మాట్లాడుతాము. దాని వలన ఒరిగింది ఏమిటని చాలా మంది అంటున్నారు.

**వేజ్ రివిజన్ రావాలంటే పంథాలకు పోకుండా ఒంటెద్దు పోకడలను విడిచిపెట్టాలి. కమిటీలో వున్న సభ్యులందరు వాస్తవాలను గ్రహించి త్వరలో మంచి ఆలోచనలతో ముందుకు వెళ్ళి వేజ్ రివిజన్ సాధించాలని ఆశిద్దాం.**

**ఎన్.ఎఫ్.టి.ఇ. జిందాబాద్ - కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి - లాంగ్ లీవ్ బి.ఎస్.ఎన్.ఎల్.**

ఇప్పటికే చాలా సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఫలితాలు రావడం లేదు. కార్మికులు అడిగే ప్రశ్నలకు జవాబు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది, ఇది వాస్తవం.

కొత్తగా అంటే 2001 తర్వాత బి.ఎస్.ఎన్.ఎల్.లో వచ్చిన ఉద్యోగుల పరిస్థితి చూస్తే చాలా బాధగా వున్నది. వారు కూడా దూరం దూరంగా వుండకుండా నాయకులపై వత్తిడి పెంచాలని, మంచి సలహాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఒక వైపు ప్రమోషన్లు రావడం లేదు, వాటికి సంబంధించి పరీక్షలు జరుగుట లేదు. రెండవ వైపు వేజ్ రివిజన్ రావడం లేదు. అదే విధంగా వారి పెన్షన్ కంట్రిబ్యూషన్‌లో తగినంత అభివృద్ధిలేదు. అందుకే ఆ మిత్రులు చాలా నిరుత్సాహంగా వున్నారు. పనిచేయడానికి భయం లేదు. కానీ సంవత్సరాలు గడిచినా అభివృద్ధి లేదు. వారు వారి తోటివారితో పోల్చుకొని అసహనానికి గురి అవుతున్నారు. ఇది మంచి పరిణామం కాదు, అందరం గుర్తించాలి. ప్రస్తుతం తదుపరి వేజ్ రివిజన్ సమావేశం ఎప్పుడు జరుపుతామో తెలియజేస్తామని మేనేజ్‌మెంట్ చెప్పుతున్నది, వేచి చూడాలి.

2. బి.ఎస్.ఎన్.ఎల్. గత రెండు క్వార్టర్స్ ముగింపు సందర్భంగా లాభాలలో వున్నదని తెలియవచ్చింది. రెండవ క్వార్టర్ చివరిన 280 కోట్ల లాభాలు అర్జించిందని వార్తలో చూస్తున్నాము, వింటున్నాము. ఇది 18 సంవత్సరముల తర్వాత జరిగింది. ఈ అభివృద్ధికి సహకరించిన కార్మికులకు మరియు అధికారులకు శుభాభివందనములు. మన కంపెనీ నష్టాలు కూడా 5,370 కోట్ల నుండి 2,247 కోట్లకు వచ్చింది. కావున ఈ పరిస్థితిని సి.ఎం.డి. గారు గుర్తించి, తొందరలో వేజ్ రివిజన్‌ను సానుకూలంగా పరిష్కరిస్తారని ఆశిద్దాం.

3. దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలు తేది. 20-05-2025 రోజున జరపవలసిన సమ్మె పిలుపును. తేది. 09-07-2025 రోజుకు వాయిదా వేశారు. కారణం ఒకటే, అప్పటి పరిస్థితులలో దేశంలో యుద్ధవాతావరణం ఏర్పడుట. కానీ బి.ఎస్.ఎన్.ఎల్,లో ఎన్.ఎఫ్.టి.ఇ./ బి.ఎస్.ఎన్.ఎల్.యు. ఇచ్చిన పిలుపుమేరకు నిరసన ప్రదర్శనలు చాలా ప్రదేశాలలో జరిగినవి. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ విప్లవాభివందనాలు.

4. తేది. 31-05-2025న కా॥ అనీల్ కుమార్, జి.ఎస్. ఎ.టి.యం. గారు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారికితేది. 28-05-2025 రోజున గౌలిగూడ ఎక్స్చేంజ్ ఆవరణలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్.ఎఫ్.టి.ఇ. తరపున కా॥ బి. సునిత, సర్కిల్ అధ్యక్షులు, తెలంగాణ, కా॥ గీత, జిల్లా కార్యదర్శి, సర్కిల్ ఆఫీస్, కా॥ ఎ. సత్యనారాయణ ఉపాధ్యక్షులు హాజరై కా॥ అనీల్ కుమార్ గారిని శాలువతో సత్కరించారు.

5. శ్రీ కె.వి.ఎన్. రావు సి.జి.ఎం.టి. గారు గత నెలలో అండమాన్ నికోబార్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. వీరు తెలంగాణ రాష్ట్రంలో నల్గొండ, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలలో పనిచేసి తెలంగాణ రాష్ట్రానికి సి.జి.ఎం.టి. గా కూడా పనిచేసి యున్నారు. వీరు మంచి సహృదయులు, సమస్యలు పరిష్కరించడంలో మంచి దిట్ట. ఆ సందర్భమును పురస్కరించుకొని వారు తేది. 31-05-2025న హైదరాబాద్‌లో వున్న మిత్రులకు, శ్రేయోభిలాషులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ సమావేశానికి ఎన్.ఎఫ్.టి.యు. తరపున కా॥ బి. సునిత, సర్కిల్ అధ్యక్షులు, కా॥ సత్యనారాయణ ఉపాధ్యక్షులు, కా॥ బాల్‌రాజు, ఉపాధ్యక్షులు, కా॥ సురేష్, కా॥ ప్రసన్న కుమార్, కా॥ లాల్, కా॥ శారద మరియు కా॥ ధనుంజయ రావు, జిల్లా కార్యదర్శి సంగారెడ్డి గార్లు హాజరై శ్రీ కె.వి.ఎన్. రావు గారిని ఘనంగా సత్కరించారు.

6. తేది. 01-06-2025న కా॥ నూర్ మహమ్మద్, జె.ఇ. గారి పదవీ విరమణ సందర్భంగా కొత్తగూడెంలో వీడుకోలు సమావేశం పెండ్లి వాతావరణంలా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్.ఎఫ్.టి. తరపున సర్కిల్ కార్యదర్శి, అధ్యక్షులు, కా॥ టి. దుర్గారావు, జిల్లా కార్యదర్శి ఖమ్మం మరియు వారి మిత్ర బృందం హాజరై వారిని ఘనంగా సన్మానించారు. ఈ వీడుకోలు సమావేశం మరువరానిది. ఎందుకంటే నూర్ మహమ్మద్ గారి మనుమలు వచ్చిన అతిథులందరినీ వారు తయారు చేసిన పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు. ఈ సమావేశానికి మేనేజ్‌మెంట్ సైడ్ కూడా చురుగ్గా పాల్గొన్నారు.

7. మన ఆల్ ఇండియా వార్షిక సమావేశాలు గుజరాత్ రాష్ట్రంలో ఆగస్టు 23 నుండి 26 వరకు జరుగును. ఇవి కడ్తాల్ (వడ్తాల్) లో జరుగును. దీనిపై పూర్తి వివరాలు త్వరలో తెలియజేయగలము.

భవదీయుడు,

**విప్లవాభివందనములతో...**

ఎ. రాజమౌళి

(కా॥ ఎ. రాజమౌళి)

సర్కిల్ కార్యదర్శి, ఎన్.ఎఫ్.టి.ఇ.తెలంగాణ

**ఎన్.ఎఫ్.టి.ఇ. జిందాబాద్ - కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి - లాంగ్ లివ్ బి.ఎస్.ఎన్.ఎల్.**